# మానవుడి జన్మహక్కు

శిశూదయమైంది. పురిటిగదిలోంచి వెలువడిన కేక లోకం గుండెల్లో ప్రతిధ్వనించింది. టైము నోటుచేశారు, తాతగారు.

శిశువు భూపతనమైంది. ''కేర్... కేర్... కేర్'' ఏడ్పు కూడా ప్రారంభించాడు శిశువు; ముఖంమీద నీళ్లు చల్లి పళ్లెం మ్రోగించింది ముసలమ్మ.

''ఇదేమిటి చెప్మా! వీడి ఏడ్పు ఇలావుంది? అమ్మమ్మ ఆలోచించింది.

మంత్రసాని చేసేహడావిడీ, చంటిపిల్లాడి కొత్తగొంతూ అంతులేని సంచలనాన్ని కలిగించాయి, ఆ యింటికి.

మనుమడి ఏడుపు విని సంతోషించాడు వెంకయ్య!

క్షణకాలం నిశ్శబ్దం పేరుకుంది. అందరి ముఖాల్లోనూ విచారం ఘనీభవిస్తోంది. పురటాలు శోషపోయింది.

"కస్తూరి వేస్తోనో?"

"అబ్బే, కొంచం బ్రాందీ తెప్పించండీ!"

తాతగారు పెదవి చప్పరించారు.

స్త్రీజనం పురటాలుకి ఉపచారాలు చేస్తున్నారు. ఇల్లంతా స్త్రీ కంఠాల కోలాహలంతో రింగురింగుమంటోంది.

తరతరాలనుంచీ వస్తున్న ఆ ఇంటిలో వినూత్న సంచలనం కలుగుతోంది.

పురటాలు తేరుకుంది. "ఏవమ్మా, కాస్త నులువుగా ఉందా?" అంది పురటాలు తల్లి. "ఊఁ" నీరసంగా, నిస్త్రాణంగా మూల్గింది పురటాలు.

'..కాని వెధవ పుట్టాడ్రా! మగ వెధవ. ఎంత దుక్కలా ఉన్నాడో!' పిల్లవాణ్ణి తిట్టడం ప్రారంభించారంతా.

తీవ్రమైన నొప్పులతో బాధపడినా చల్లగా నీళ్ళోసుకొంది రంగమ్మ. ప్రమాదం దాటిందని స్థిమితపడ్డారంతా.

పురిటిశుద్ధి అయింది. తొట్టెలోకూడా పెట్టారు.

హఠాత్తుగా యెడపిల్లకి జబ్బుచేసి, చనిపోయింది.

"ఏం దురదృష్టవంతులమమ్మా! రత్నంలాంటి పిల్ల దక్కలేదు. దిక్కుమాలిన వెధవ పుట్టాడు" అంతా చంటి పిల్లవాణ్ణి తిట్టినవాళ్ళే!

ఒకదాని తరువాత ఒకటిగా ఎన్నో విపరీతాలు ఆ ఇంటి వాతావరణంమీద గూడుకట్టుకోవటం ప్రారంభించాయి.

పదహారురోజుల పసికందూ తొట్టిలో పడుకుని అమాయికంగా నవ్వుతూనే ఉన్నాడు; కేరింతలు కొడుతున్నాడు.

కన్న కడుపుకూడా కోపించింది. "ఈ దరిద్రగొట్టు వెధవ జన్మెత్తి మాణిక్యంలాంటి పిల్లని దక్కనీకుండా చేశాడు! వీడు నాకు కొడుకేమిటి?" నిర్ణయానికొచ్చింది తల్లి.

రోజులూ, వారాలూ, నెలలూ, సంవత్సరాలు గబ గబా ఆ యింటి పంచాంగంనుంచి తప్పుకున్నాయి.

ఆనాటివరకు, మూసలోని తగరంలా, చుట్టకుదురు మీది పాలకుండలా ఉంది సంసారం.

ఆ వెధవాయి పుట్టినదగ్గర్నుంచీ ఏదో కొత్త సంచలనం పెరుగుతూనే వచ్చింది. అంచాతనే తాతగారి కేదో భయం పీడ్ని చూస్తే!

"ఈ వెధవేమిటమ్మా! మహారాలుగాయవుతున్నాడు? ఒద్దుమొర్రో అంటే ఆసాయిబుగారింటికి వెళ్ళి కూర్చుంటాడు!"

"తాతగారి గుండెల్లో బెదురు ముదిరి వాడిమీద అకారణద్వేషానికి దారిచ్చింది. (పురాతన సాంప్రదాయాల్నీ, పవిత్రమైన మతాన్నీ నాశనం చేయడానికే జన్మించాడు కాబోలు వీడు !")

'వీడిలో ఏ ప్రత్యేకతా ఉండడానికి వీల్లేదు. సాదా సంసారిలా, చాపకింది నీరులా వీడు బ్రతకాలి'.

ఆ నిర్ణయంతోనే తాతగారు వాణ్ణి పెంచటం ప్రారంభించారు. అంచాతనే వాడికి ఆంధ్రదేశంలో 'నువ్వో' 'నేనో' కాని ప్రతీ మూడవవాడికీ ఉండే 'సుబ్బారావు' అనే పేరునే పెట్టారు.

సుబ్బారావు పెద్దవాడవుతున్నాడు. 'వాడే పని చేసినా 'అల్లరి' అనేదానికి మాత్రమే దోహదమయేది. ఏదో తపనా ఆలోచనా ప్రతినిత్యం వాడి ముఖంలో కనిపించేవి.

సుబ్బారావుని చిన్నప్పటినుంచీ ప్రతిఒక్కరూ ద్వేషిస్తూనే ఉండేవారు. మానుపిల్లి అనీ, ఆబోతనీ, వాళ్ళకి ఇష్టం వచ్చిన మరికొన్ని ఘనపదార్థాల పేర్లనూ వాడికే తగిలించేవారు. కాని చివరికి 'మాను' అని మాత్రమే సార్థకమైంది.

"వాడి జన్మకాల నక్షత్రం ఏమిటోకాని ప్రతివారూ తిట్టడమేనర్రా !" అమ్మమ్మ సిద్ధాంతీకరించేది కూడా !

తాతగారు చెప్పే ఇంగ్లీషు పాఠాలు, అమ్మమ్మ చెప్పే భాగవతంలోని పద్యాలు రింగుమని ఒక్క గుక్కలో అప్పగించే వాడు.

కాని అంతా ఇంకా తిడుతూనే ఉన్నారు.

అయిదేళ్ళ తరువాత రంగమ్మ పుట్టింటికి వచ్చింది. "అబ్బా! సుబ్బారావెంత పెరిగాడో" కన్నతల్లికే ఆశ్చర్యమైంది; పెద్దశరీరంతో పెరిగిన కొడుకునిచూస్తే.

వయస్సువచ్చినకొద్దీ, సుబ్బారావులో అజ్ఞాతంగావున్న ఆశయాలు కొత్తరూపాలు ధరించి వెలువడ్డం ప్రారంభించాయి. "మతం అంటే ఏమిటి? కులం అనేది ఎందుకు పుట్టింది? ఉన్న వాళ్లూ లేనివాళ్లుగా ఈలోకం విడిపోడానికి కారణం ఏమిటి?" అనేప్రశ్నలు తీవ్రమైన సమస్యలుగా సుబ్బారావుకి ఎదురుగా వచ్చి నించుని పరిష్కారాన్ని వాంఛిస్తూ నగ్ననృత్యం చేసేవి.

"ఏమిరా! నువ్వు తురకలతోటీ మాలాళ్ళతోటీ కలిసి జోస్తీగా తిరుగుతున్నావని తెలియిస్తోంది. ఇలాంటి పిచ్చి వేషాలువేస్తే ఊరుకోం తెలుసా?" తాతగారు గర్జించారు.

"నేనేం తప్పుచేయడంలేదే? నేను స్వంతంగా ఆలోచిస్తున్నా; నాకు మెదడుంది కాబట్టి. ఆలోచించి తేలిన సత్యాన్నే ఆచరిస్తాను..." అన్నాడు సుబ్బారావు నిర్భయంగా.

ఈవాక్యమే తాతగారి గుండెల్లో బల్లెం అయింది.

ప్రతీక్షణమూ కొలబద్దయి, సుబ్బారావులోని సంస్కారాన్ని పెంచుతూనే ఉంది. నిమిషాల నిచ్చెనమీద విజ్ఞాన శిఖరాలకి ఎగబ్రాకుతూనే ఉన్నాడు సుబ్బారావు.

నిర్భయంగా నిజం చెప్పడం లోకానికి నిష్ఠురమైంది. సుబ్బారావునుచూచి కాండ్రిస్తోంది లోకం. తన కోపానికి చిహ్నంగా లోకం వాడ్ని 'మాను' అని పిలవటం మానలేదు.

సుబ్బారావు తన్ను ఎదుర్కొన్న సమస్యలను కథల్లో పరిష్కరించటానికి ప్రయత్నించి విజయం పొందాడు. మిత్రులు అతన్నిచూచి ఆనందించారు. లోకంమాత్రం కంటకప్రాయం గానే చూస్తోంది.

అర్థంలేని కోపం తాతగారి ఆపాదమస్తకాన్నీ ముంచెత్తింది. 'ఏమిటిరా? ఆ వెధవనడత..' తాతగారు కోపగించారు.

"హిందూమతం భగవద్గీతతోటీ, క్రిస్టియానిటీ బైబిలుతోటీ, ఇస్లాంమతం ఖురాన్‌తోటీ ఆగిపోలేదు. ఆలోచిస్తే యింకా వుంది. మానవుడికి మతం ఒకప్పుడు ఆత్మరక్షణకి అవసరమైంది. కోడిపిల్లకి, తనని నాటివరకూ రక్షిస్తూన్న పైగుడ్డుగుల్లకే, దాని అభివృద్ధిని అరికడ్తే గోడగా తయారైనప్పుడు, దాన్నే బద్దలుకొట్టుకొని బయటికి రావటం స్వతసిద్ధంగా అవసరమాతుంది!"

సుబ్బారావు మాటలు వింటూంటే తాతగారి గుండె ధడుకూ, ధడుకూ మంది. ఆ యింటిల్లో ఇంతవ్వరకూ ఎవ్వరూ

ఇంత చెడ్డవాళ్ళు పుట్టలేదట! వీడు దిక్కుమాలిన జన్మమెత్తి నిర్మలంగా ఉన్న నీటిలో కలవరం లేవదీస్తున్నాడట!

సుబ్బారావు నిర్భయంగా అంటున్నాడు. 'తిరుగుబాటు నా ఊపిరి; అరలు అరలుగా అమర్చబడిన ఈ లోకాన్ని కుదుమట్టంగా భగ్నంచేసి, తేడాపాడాలులేని సమాజాన్ని సృష్టించడమే నా జీవితాశయం!' అని.

తాతగారికి ఒళ్ళు మండిపోయేది. పక్కింటి గన్నయ్య శాస్త్రిని పిలిచి ఒకనాడన్నారు కూడాను—

"చూశారా? శాస్త్రిగారూ, మావాడేమిటండీ! వఠి వెధవ పుట్టాడు. ఎంత చెప్పినా వినడు!"

"అంతేనండి ఇప్పటివాళ్ళు, ఇహ్హిహ్హి! నీళ్ళు నమిలాడు గన్నయ్యశాస్త్రి.

"మానవనిర్మితమైన దరిద్రం, మానవునిచేతనే నాశనం చేయబడుతుంది. ప్రతివానికీ, సుఖమూ, విశ్రాంతీ విజ్ఞానమూ మొదలైనవి లభించే అవకాశం ఏర్పరుచుకోవడం మానవుని జన్మహక్కు. మానవుడు తనహక్కుల్ని జయించి తీరతాడు" అని ఉద్వేగంగా చెబుతున్నాడు సుబ్బారావు.

జనం విస్మయం పొందారు. స్నేహితులు హర్షించారు.

లోకం అంటోంది: "మొన్న మొన్నటి 'మాను' గాడు ఎంతవాడయ్యాడూ?" అని.

*

★